క్లుప్తంగా

తోలేరులో పొలం పిలుస్తోంది



తోలేరులో పొలం పిలుస్తోందిలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

వీరవాసరం: మండలంలోని తోలేరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సహాయక వ్యవసాయ సంచారకులు సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులకు వరిలో వచ్చే కాండం తొలుచు పురుగు గురించి వివరించారు. నివారణ చర్యలు గురించి తెలియజేశారు. వెండలో పురుగుల మందులు పిచికారి చేయవద్దని తెలిపారు. రైతులకు కావలసిన గోనె సంచులు ముందుగానే సిద్ధంగా ఉంచడం జరుగుతుందని తెలియజేసారు. కార్యక్రమంలో కె.సరోజ, బిస్సిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

భూ-సర్వే పక్కాగా నిర్వహించాలి



భూ సర్వేపై మాట్లాడుతున్న ఆర్డీఓ దాసిరాజు

పెనుగొండ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ సర్వే పక్కాగా నిర్వహించాలని నరసాపురం ఆర్డీఓ దాసిరాజు అన్నారు. మంగళవారం ఆచంట తహసీల్దారు కార్యాలయంలో భూసర్వేపై సర్వేయరు సిబ్బందితో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. సర్వే ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆయన వెంట తహసీల్దారు జి.కనకరాజు ఉన్నారు.

రామలింగేశ్వరుని సన్నిధిలో హనుమాన్ చాలీసా పారాయణం



హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న మహిళలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో కొలువై ఉన్న ఆంజనేయస్వామి ఉపాలయం వద్ద మంగళవారం మహిళలు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఏకాదశి మంగళవారం కావడంతో ఆలయంలో భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బీఐఎస్ మార్క్‌పై అవగాహన



విద్యార్థులు తయారు చేసిన బీఐఎస్ పోస్టర్లు

పాలకొల్లు సెంట్రల్: వినియోగదారులు ఏదైనా వస్తువు కొనేటప్పుడు బీఐఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్) మార్కు ఉన్న వస్తువులనే కొనుగోలు చేయాలని బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.ప్రభాకరశాస్త్రి అన్నారు. మంగళవారం స్థానిక బీవీఆర్ఎం బాలికోన్నత పాఠశాలలో బీఐఎస్ మార్క్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకరశాస్త్రి మాట్లాడుతూ బీఐఎస్ మార్కు వస్తువులకు సంబంధించిన నాణ్యతను తెలియజేస్తుందన్నారు. విద్యార్థులకు బీఐఎస్ పోస్టర్ తయారీ పోటీలను నిర్వహించారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతి, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో బీఐఎస్ మెంటర్ సీహెచ్ శిరీష, ఉపాధ్యాయురాలు డి.సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు



భీమవరంలోని లాడ్జిలో పేకాడుతున్న వారిని అరెస్టు చేసిన దృశ్యం

భీమవరం: భీమవరం పట్టణం జువ్వలపాలెం రోడ్డులోని ఓ లాడ్జిలో పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు టుటౌన్ సీఐ జి కాళీచరణ్ చెప్పారు. మంగళవారం సాయంత్రం విసిపిస్టే లాడ్జీపై దాడిచేయగా పేకాడుతున్న వారిని అరెస్టు చేసి వారి నుంచి రూ.1,01,600 నగదు, ఆరు సెల్‌ఫోన్స్, రెండు మోటారు సైకిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ కాళీచరణ్ చెప్పారు.

కాలువలను పూడ్చేస్తున్నా పట్టించుకోరా?



వెలివర్రు పరిధిలో పంటకాలువను పూడ్చి మట్టి రవాణాకు వంతెన నిర్మించిన దృశ్యం



పంటకాలువలు ఆక్రమణలతో మహదేవపట్నం పరిధిలో పసర్లు బారిన సాగునీటినే తోడుకుంటున్న రైతులు

- పంటకాలువలు పూడ్చి వంతెనలు నిర్మిస్తున్న వైనం
- ఆక్రమణలతో పసర్లు బారుతున్న సాగునీరు

ఉండి: ఆక్రమణలకు కాదేదీ నర్హం అన్నట్లు ఉండి మండలంలోని పరిస్థితి ఉంది. సాధారణంగా కాలువ గట్లు, బోదె గట్లు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తూ ఉంటారు. కానీ మండలంలో పలువురు పంటకాలువలనే మట్టితో పూడ్చి ఆక్రమించుకుంటున్నారు. అవసరాలను బట్టి వంతెనలు నిర్మించుకుంటున్నారు. మండంలోని వెలివర్రు శివారు ప్రాంతంలో మట్టి రవాణా కోసం లేదా ఇతర అవసరాల కోసమో? పంటకాలువనే పూడ్చివేశారు. మట్టితో పూర్తిస్థాయిలో పూడ్చేసిన సదరు వ్యక్తులు పైనున్న రైతుల కన్నీళ్ల తుడిచేందుకు అన్నట్లు ఒక సిమ్మెంటు తూరను ఏర్పాటు చేసి నీటి సరఫరాకు ఆటంకం లేకుండా చేశామని చెబుతున్నారు. సుమారు 5 మీటర్ల వెడల్పున ఉండే పంట కాలువనపు పూర్తిగా పూడ్చివేసి కేవలం మీటరు వెడల్పున్న తూరను పెట్టి నీటి సరఫరాకు పూర్తిస్థాయిలో విఘాతం కలిగేలా సదరు వ్యక్తులు వ్యవహరిస్తున్నా గానీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు రైతులు మండిపడుతున్నారు.

పట్టించుకోని అధికారులు

ఈ స్థాయిలో ఆక్రమణలు జరుగుతునా ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులు గానీ కనీసం క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకపోవడం విడ్డూరంగా ఉందంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు. ఆక్రమణల వల్ల శివారు ప్రాంత రైతులకు వరి చేలకు,ఆక్వా చెరువులకు నీరు అందకపోవడంతో పంట కాలువల్లోని నీరు పసర్లు బారిపోతున్నాయి. ఇప్పటికే వంతులవారీ విధానంలో సాగునీరు అందిస్తుండగా ఇప్పుడు కాలువల ఆక్రమణలతో సరిగ్గా నీరందడం లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరికి చెప్పినా పట్టించుకోకపోవడంతో చేసేది లేక రైతులు పసర్ల నీటినే చెరువుల్లోకి కలుషితమైన నీటినే తోడుకుంటున్నారు. నిరుపేదలు నిలువ నీడ లేక చిన్న చిన్న స్థలాలు ఆక్రమించుకుని గుడిసెలు వేసుకుంటే వాటిని ఉన్నపళంగా కూలగొట్టేస్తున్న అధికారులు పంట కాలువలను ఆక్రమించుకుంటుంటే మాత్రం చీమకుట్టినట్లు కూడా వ్యవహరించకపోవడం విడ్డూరంగా ఉందంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి కాలువలను ఆక్రమించుకుని నిర్మించిన అక్రమ వంతెనలు తొలగించి శివారు ప్రాంతాల రైతులకు సాగు నీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

సాగు నీరందక ఇబ్బందులు



అసలే వంతుల విధానం ఆపై పంట కాలువలు, పిల్ల కాలువలకు అడ్డుకట్టలు వేసి పూడ్చేస్తుంటే అధికారులు ఎందుకు చోద్యం చూస్తున్నారు? కాలువను పూడ్చి పేరుకు చిన్న తూర పెట్టి చేతులు దులుపుకుంటుంటే అధికారులకు కనిపించడం లేదా? ఇలా అయితే శివారు ప్రాంత రైతులకు సాగు నీరు ఎలా అందుతుంది.

– దానం విద్యాసాగర్, న్యాయవాది, పాములపర్రు

నీరు పనికి రాకుండా పోతుంది



ఎక్కడికక్కడ పంటకాలువలు, బోదెలు పూడ్చేయడం వల్ల సాగునీరు ప్రవహించకపోవడంతో పసర్లుబారుతుంది. చేసేది లేక రైతులు అదే నీటిని వరి చేలు, ఆక్వా చెరువుల్లోకి తోడుకుంటున్నారు. కలుషితమైన సాగునీటి వల్ల అటు వరి పంట, ఇటు ఆక్వా సాగు నష్టాల బాటలో నడుస్తుంది.

– జంపా నాగేశ్వరరావు, ఉండి

ఆస్తి పన్నుల వడ్డీపై 50 శాతం రాయితీ

ఆకివీడు: ఇంటి పన్ను, ఖాళీ స్థల్లాల్లో చెల్లించాల్సిన పన్ను సకాలంలో చెల్లించకపోతే 2 శాతం వడ్డీతో చెల్లించాలని, అయితే ప్రభుత్వం జారీ చేసిన జీఓ ప్రకారం యాభై శాతం వడ్డీ రాయితీతో పన్ను చెల్లించే అవకాశాన్ని కల్పించారని నగర పంచాయతీ కమిషనర్ జీ.కృష్ణమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి అర్ధ సంవత్సరానికి జూన్ నెలాఖరులోపు, రెండో అర్ధ సంవత్సరానికి డిసెంబర్ నెలాఖరులోపు పన్ను చెల్లించని వారు 2 శాతం వడ్డీతో కలిపి చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అయితే ఈ నెల 31వ తేదీలోపు ఒకేసారి పన్ను చెల్లించిన వారికి రాయితీ కల్పిస్తూ జీఓ జారీ చేశారని కమిషనర్ వివరించారు. ఇప్పటికే పన్ను బకాయి వడ్డీతో చెల్లించిన వారికి యాభై శాతం రాయితీ వచ్చే ఆర్థిక సంవత్సరంలో జమ చేస్తామని స్పష్టం చేశారు. నగర పంచాయతీ పరిధిలోని పన్ను బకాయిదారులు అవకాశాన్ని వినియోగించుకుని సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రౌడీషీటర్లపై బైండోవర్



భీమవరంలోని సెంట్రల్ క్రైమ్ పోలీసు స్టేషన్ వద్ద రౌడీషీటర్స్‌కు కౌన్సిలింగ్ ఇస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం టుటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని రెండు రౌడీషీటర్స్ గ్రూపులకు మంగళవారం టుటౌన్ సీఐ జి కాళీచరణ్ కౌన్సిలింగ్ నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం శిక్షలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వారిని బైండోవర్ చేసినట్లు సీఐ కాళీచరణ్ చెప్పారు.

1 నుంచి ధాన్యం కొనుగోలు ప్రారంభం



మాట్లాడుతున్న ఏడీఏ శ్రీనివాస్, ఏఓ సంధ్య

ఉండి: ఏప్రిల్ 1వ తేదీ నుంచి మండల వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు ఏడీఏ కేఏఎస్ఎస్ శ్రీనివాస్ అన్నారు.మండల వ్యవసాయాధికారి బీ సంధ్య ఆధ్వర్యంలో మంగళవారం ఉప్పులూరు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఏప్రియల్ రెండవ వారంలో మండలంలో వరి కోతలు ప్రారంభం కాబోతున్న దృష్ట్యా 1వ తేదీ నుంచే ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా, రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోళ్లు చేపడతామని తెలిపారు.పండించిన ధాన్యానికి మంచి ధర లభించేలా రైతులంతా రైతుసేవా కేంద్రాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారానే తమ ధాన్యాన్ని అమ్ముకోవాలని అన్నారు. వాట్సప్ ద్వారా ధాన్యం అమ్మకం షెడ్యూల్ ఇచ్చుకునే విధానాన్ని రైతులు అలవాటు చేసుకోవాలని సూచించారు. రైతులు ప్రస్తుతం తమ పంటలను పరిశీలించి పురుగు, తెగుళ్ళ ఉధృతి ఉన్నప్పుడు మాత్రమే పురుగుమందులు పిచికారీ చేయాలని అన్నారు. అనవసరంగా మందులు వాడొద్దని రైతులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భాగస్వామ్య వ్యవసాయంపై విశ్లేషణ



భాగస్వామ్య వ్యవసాయంపై రైతులకు విశ్లేషిస్తున్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు

పాలకోడేరు: వ్యవసాయంలో ఎప్పటికప్పుడు మెళకువలు తెలుసుకుని ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేస్తే అధిక ప్రయోజనాలు పొందవచ్చని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరంలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ కృషి, అనుభవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పాలకోడేరు మండలం విస్సా కోడేరు శివారు వంకాయల పాలెం గ్రామంలో రైతులతో కలిసి గ్రామీణ భాగస్వామ్య వ్యవసాయంపై విశ్లేషత్మక సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హెచ్ శ్రీనివాసరావు, సమన్వయకర్త డాక్టర్ మల్లికార్జునరావు, డాక్టరు ఆర్.బిందు ప్రవీణ పాల్గొన్నారు.

పాస్టర్ మరణంపై విచారణ చేయాలి



సీఐ జగదీష్‌కు వినతిపత్రం అందజేస్తున్న యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు

ఆకివీడు: రాజమండ్రిలోని కొంతమూరు-దివాన్‌చెరువు మధ్యలో మరణించిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణంపై పూర్తి విచారణ చేపట్టాలని ఆకివీడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జగదీష్‌కు మంగళవారం యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. పాస్టర్ మరణంపై అనుమానాలు వ్యక్తం అవుతున్న సందర్భంగా న్యాయమైన విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ఫరూక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫెలోషిప్ మండల అధ్యక్షుడు కె.దీవెనరాజు,ఉపాధ్యక్షులు ప్రభుకుమార్, జాన్‌ప్రకాష్, ఏలియా, డాక్టర్ రత్నకుమార్ పాల్గొన్నారు.

శక్తి యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మెంటేవారితోటలో మహిళలకు శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమవరం: మహిళల రక్షణ కోసం శక్తి పేరిట రూపొందించిన యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అహ్మదున్నీసా చెప్పారు. మంగళవారం పట్టణంలోని మెంటేవారితోటలో అమ్మ సేవా బృందం మహిళలకు అహ్మదున్నీసా శక్తి యాప్‌పై అవగాహన కల్పించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళలు వివిధ సందర్భాల్లో ప్రయాణాల్లో తోటి మనిషి సాయం లేకుండా మన వద్దనున్న మొబైల్ ఫోన్‌లోని శక్తి యాప్‌ను ఆయుధంగా ఉపయోగించుకోవచ్చునన్నారు. అనంతరం మహిళలకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించి వారి మొబైల్ ఫోన్‌లో యాప్‌ను డౌన్‌లెడ్ చేయించారు. ఈ కార్యక్రమంలో మహిళా కానిస్టేబుల్ లక్ష్మి, అల్లు శ్రీనివాస్, అమ్మ సేవా బృందం అధ్యక్షురాలు జవ్వాది పద్మశ్రీ, కోమటి వెంకటేశ్వరి, కె శ్రీదేవి, తవ్వ స్వాతి, కోయ సరోజిని, గంటా వేణు, కోయ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నౌడూరులో సీపీఐ నేత యాళ్లబండి స్థూపాన్ని తొలగించవద్దు



భీమవరంలో ఎమ్మెల్యే అంజిబాబుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

భీమవరం: వీరవాసరం మండలం నౌడూరు సెంటర్ రోడ్డు విస్తరణలో స్వాతంత్ర్య సమర యోధుడు, సీపీఐనేత యాళ్లబండి పోలిశెట్టి స్మారక స్థూపాన్ని తొలగించవద్దని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు), జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్‌రెడ్డిని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో అంజిబాబు, కలెక్టరేట్‌లో జేసీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ పోలిశెట్టి నాటితరం రాజకీయాల్లో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అలుపెరుగని పోరాటాలు చేశారని, అంటరానితనం, పెత్తందారీలకు వ్యతిరేకంగా, డెల్టా ప్రాంతంలో భూపోరాటాల్లో ఎన్నో ఉద్యమాలు నడిపించారని గుర్తు చేశారు. సీపీఐ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శిగా, నౌడూరు సర్పంచ్‌గా, విస్సాకోడేరు సమితి ఉపాధ్యక్షుడిగా ప్రజలకు సేవలందించారన్నారు. యాళ్లబండి సేవలకు గుర్తింపుగా గ్రామస్థులు నౌడూరులో ఆయన స్మారక స్థూపాన్ని నిర్మించారని ఇప్పుడు రోడ్డు విస్తరణలో దాన్ని తొలగించడానికి మార్కింగ్ చేశారని కోనాల అన్నారు. స్థూపం తొలగించకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం సీతారాంప్రసాద్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వైవి ఆనంద్, పాలకోడేరు సీపీఐ కార్యదర్శి ఎం.లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన హ్యాండీక్రాఫ్ట్స్ ఎక్స్‌పో

నరసాపురం రూరల్: నరసాపురం మండలంలోని రుస్తుంబాద గ్రామంలోని అంతర్జాతీయ లేసు ట్రేడ్ సెంటర్ (ఐఎల్‌టీసీ)లో ఈపీసీహెచ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హ్యాండీ క్రాఫ్ట్స్ ఎక్స్‌పో మంగళవారంతో ముగిసింది. ఈపీసీహెచ్ సదరన్ రీజియన్ కోఆర్డినేటర్ కలవకొలను తులసి ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నిర్వహించిన ఈ ఎక్స్‌పో చివరి రోజు కావడంతో సందర్శకుల తాకిడి ఎక్కువైంది. ఉభయ గోదావరి జిల్లాలు, పరిసర ప్రాంతాల నుంచి సందర్శకులు, కొనుగోలుదారులు పోటెత్తారు. చివరి రోజు సాయంత్రం వరకూ హస్త కళాకారులు తయారు చేసిన ఉత్పత్తుల విక్రయం , ప్రదర్శనలతో ఐఎల్‌టీసీ ప్రాంగణం అంతా పండుగ వాతావరణం నెలకొంది.

ప్రాథమిక నిర్ధారణతో క్యాన్సర్ నివారణ



తూర్పుతాళ్లులో క్యాన్సర్‌పై అవగాహనను కల్పిస్తున్న వైద్యసిబ్బంది

నరసాపురం రూరల్: క్యాన్సర్‌ను ప్రాథమికంగా గుర్తించి, సరైన చికిత్స, మందులు వాడటం ద్వారా నివారించవచ్చునని డాక్టర్ ధనలక్ష్మి, ప్రోగ్రాం అధికారి గాతల సుభాస్ అన్నారు. మంగళవారం నరసాపురం మండలంలోని తూర్పుతాళ్లు గ్రామంలో ఎన్‌సీడీ 3.0 జిల్లా కార్యక్రమంలో భాగంగా నాన్ కమ్యూనికల్ డిసీజెస్ బృందం పర్యటించింది. ఈ బృందం ఇంటింటి స్క్రీనింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటింటి స్క్రీనింగ్ కార్యక్రమంలో ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ కాన్సర్‌లను, హైపర్‌టెన్షన్, డయాబెటిస్ లను గుర్తించడానికి స్క్రీనింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ ప్రోగ్రామ్‌లో తూర్పుతాళ్లు వైద్యాధికారి ఆకుల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న 11 మంది అరెస్టు

పెనుగొండ: మండలంలో ఇలపర్రు గ్రామ శివారు పొలాల్లో పేకాడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామని ఎస్సై కె.గంగాధర్ మంగళవారం విలేకరులకు తెలిపారు. నిందితుల దగ్గర నుంచి రూ.6400 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: మండలంలోని ఊటాడలో పేకాడుతున్నారనే సమాచారంపై మంగళవారం దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్సై కర్టీడి గుర్రయ్య తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2830 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గుర్రయ్య చెప్పారు.

మున్సిపాలిటీలో విజిలెన్స్ తనిఖీలు

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీలో విజలెన్స్ అధికారులు పలు ఫైళ్లను తనిఖీ చేశారు. విజలెన్స్ డీఈ శ్రీనివాసన్‌తో పాటుగా మరో ఇద్దరు అధికారులు తనఖీల్లో పాల్గొన్నారు. 2019-24 మధ్య కాలంలో మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి ఇంజనీరింగ్ సెక్షన్‌లో ఫైళ్లను పరిశీలించారు. అలాగే టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో వివిధ కట్టడాలకు ఇచ్చిన అనుమతులపై ఆరా తీశారు. గత ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటిలో అభివృద్ధి పనుల్లో అవినీతి జరిందని కొందరు విజిలెన్స్ శాఖకు ఫిర్యాదు చేయడంతో ఈ తనిఖీలు చేసినట్టుగా తెలిసింది.

ఫెస్ట్‌ల నిర్వహణ విద్యార్థుల ప్రతిభను వెలికి తీస్తుంది



భీమవరం డీఎన్నార్ కళాశాలలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: ఫెస్ట్‌ల నిర్వహణ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించటానికి, నూతన సాంకేతిక నైపుణ్యాలను నేర్చుకోడానికి అద్భుతమైన వేదికగా ఉపయోగపడతాయని భీమవరం డీఎన్నార్ కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు) అన్నారు. మంగళవారం డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాల ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్ డిపార్ట్‌మెంట్స్ ఆధ్వర్యంలో రెండు రోజులుపాటు నిర్వహించిన ఫెస్ట్ ముగింపు సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపల్ ఎం అంజన్‌కుమార్ మాట్లాడుతూ టెక్ ఫెస్ట్‌లో మొదటి రోజు ప్రాజెక్ట్ ఎక్స్‌పో, పోస్టర్ ప్రెసెంటేషన్, పేపర్ ప్రెజెంటేషన్, స్పెల్ బీ వంటివి నిర్వహించగా వాటిలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేసినట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి.

కౌలు రైతులను గుర్తించాలి



ఉండిలో వ్యవసాయాధికారికి వినతిపత్రం అందజేస్తున్న కౌలు రైతు సంఘ నాయకులు

ఉండి: కౌలు రైతును కూడా సాధారణ రైతులుగా మాదిరి గుర్తించి వారికి కౌలురైతు కార్డులు ఇవ్వడంతో పాటు ప్రభుత్వం నుంచి రైతులకు లభించే ప్రతి పథకం వారికి అందించాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉండి వీరభద్రం, బద్దా రమేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఉండిలో నిర్వహించిన కార్యక్రమంలో కౌలు రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలంటూ మండల వ్యవసాయ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కౌలు రైతుకు తగిన గుర్తింపు లభించడం లేదని అన్నారు.వారికి వెంటనే గుర్తింపుకార్డులు మంజూరు చేసి బ్యాంకుల ద్వారా హామీ లేని రుణాలను అందించాలని అన్నారు. అలాగే బీమా, సబ్సిడీలను కూడా అందించాలన్నారు. ఉచిత పంట భీమా సౌకర్యాన్ని అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కర్రి సూరిబాబు, కోనా గొల్లయ్య, కలిశెట్టి వెంకట్రావు, వైవీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లవానితిప్ప పీహెచ్‌సీ తనిఖీ



పీహెచ్‌సీలో పలు రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జి. గీతాబాయి

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్పలో కొప్పర్తి వీరాస్వామి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జి. గీతాబాయి తనిఖీ చేశారు. ల్యాబ్, ఫార్మసీ, ఓపీ, డెలివరీరూమ్ పరిశీలించి పలు సూచనలు చేశారు. సిబ్బంది హాజరుపట్టీని పరిశీలించి పలు అంశాలకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులను పలకరించి అందుతున్న వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాశాఖాధికారి జి. గీతాబాయి మాట్లాడుతూ రోగులకు పట్ల చిత్తశుద్ధితో ఉండాలని నాణ్యమైన వైద్యాన్ని అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వై. హసిత, డాక్టర్ కె. అరుణరాణి, ఎంపీహెచ్‌ఈవో కె. అప్పారావు, ఎంపీమెచ్ఎస్ జి. శ్రీనివాసరావు, ఎమ్ విజయకుమారి, తదితరులు ఉన్నారు.

వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేయాలి



రాయకుదురులో వ్యవసాయ సమావేశ దృశ్యం

వీరవాసరం: యువత వ్యవసాయ రంగంపై మొగ్గు చూపే విధంగా సమాజం అభివృద్ధి చెందాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి శ్రీనివాస్ తెలిపారు. రాయకుదురులో వ్యవసాయ గ్రామీణ భాగస్వామి విశ్లేషణాత్మక సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగ అభివృద్ధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలను వివరించారు. రాయకుదురు గ్రామ రెవెన్యూ పటాన్ని రంగవల్లులతో అందంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ హెచ్ శ్రీనివాస్, కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్ మల్లికార్జునరావు ,వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ బి.ఆర్ బిందు ప్రవీణ, గ్రామ సర్పంచ్ గెడ్డం భారతి,పోలిశెట్టి సత్యనారాయణ, కళాశాల విద్యార్థిని, విద్యార్థులు ,సిబ్బంది పాల్గొన్నారు.

మావుళ్లమ్మ సేవలో కృష్ణవంశీ



మావుళ్లమ్మను దర్శించుకుంటున్న కృష్ణవంశీ

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని మావుళ్లమ్మ అమ్మవారిని మంగళవారం సినీ దర్శకుడు కృష్ణవంశీ దర్శించుకున్నారు. ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ సహాయ కమిషనర్ బుద్దా మహాలక్ష్మీనగేష్ అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.

మల్లేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవాలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామంలో బాలాత్రిపుర సుందరీ సమేత మల్లేశ్వరస్వామి వారి పాంచాహ్నిక ధ్వజారోహణ కల్యాణోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 29వ తేది వరకు కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి ముళ్లపూడి రామకృష్ణ తెలిపారు. సాయంత్రం స్వామివారి కల్యాణం, అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు విరివిగా పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించి, అన్నప్రసాదాన్ని స్వీకరించారు.